క్లుప్తంగా

గిరిజన మోర్చా రాష్ట్ర కోశాధికారిగా శంకర్‌నాయక్



నాంపల్లి: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కోశాధికారిగా నాంపల్లి మండలంలోని నామానాయక్ తండా గ్రామానికి చెందిన వడ్త్యా శంకర్‌నాయక్‌ను నియమిస్తూ మంగళవారం గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని శంకర్‌నాయక్ పేర్కొన్నారు.

డైరీ ఆవిష్కరణ

నల్లగొండరూరల్: నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రచార పోస్టర్‌ను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్. రాజారాం, సయ్యద్ మునీర్, త్రిపురం భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, అపర్ణా చతుర్వేది, స్వామి, అరుణ, మంజుల, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జోడోయాత్రను జయప్రదం చేయాలి

శాలిగౌరారం: మాదిగల హక్కుల సాధన కోసం ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో నల్లగొండలో బుధవారం ప్రారంభంకానున్న మాదిగ జోడోయాత్రను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకుడు ఇంద్రకంటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఎస్సీ వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని వ్యతిరేకిస్తూ జోడోయాత్ర జరుగుతుందన్నారు. మాయమాటలతో కాలయాపన చేస్తున్న బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించేందుకు మాదిగలు సిద్ధం కావాలన్నారు. ఆయన వెంట మాతంగి సైదులు, పోలేపాక నరేశ్, దేవరకొండ సహదేవ్ తదితరులు ఉన్నారు.

ఆలయాలకు చైర్మన్ల ఎన్నిక



ఆలయాల చైర్మన్లను సత్కరిస్తున్న చందుపట్ల గ్రామస్తులు

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామంలోని శివాలయం చైర్మన్‌గా కోటగిరి రామకృష్ణ, లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయ చైర్మన్‌గా మంగినపల్లి వెంకటయ్య, రామాలయం చైర్మన్‌గా మేడవరపు కిషన్‌రావును మంగళవారం ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్లను గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో మల్లిరెడ్డి రంగారెడ్డి, పుట్ల సత్యనారాయణ, కొప్పు సత్తయ్య, కొల్లు నర్సయ్య, బెజవాడ లక్ష్మీనారాయణ, దోరేపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అయిటిపాములో కార్మికులకు కేంద్ర పథకాలను వివరిస్తున్న గోలి ప్రభాకర్

కట్టంగూర్: కేంద్ర పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్ గ్రామాల్లో కేంద్ర పథకాలను పలువురు కార్మికులకు వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో ఉన్న అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలి

నల్లగొండటౌన్: పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ నుంచి పెద్దబండ వరకు, డీఈఓ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండీ సలీంలు డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడం వలన దుమ్ము, ధూళితో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న విద్యుత్, డ్రెయినేజీ నిర్మాణాలకు నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పద్మ, కృష్ణారెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

దర్జా కోల్పోతున్న దర్జీలు

- రెడీమేడ్ దుస్తుల ప్రభావంతో అంతంతమాత్రంగానే ఉపాధి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- నేడు అంతర్జాతీయ టైలర్స్ డే



పనిలో నిమగ్నమైన దర్జీలు

నల్లగొండ టూటౌన్: ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన దర్జీలు నేడు ఆ దర్జా కోల్పోతున్నారు. పెళ్లిళ్లు, పండుగలు, శుభకార్యాలు తదితర వాటి కోసం కొత్త బట్టలు కుట్టించుకోవాలంటే నెల రోజులు ముందుగా ఇస్తేనే కుట్టి ఇచ్చేవాళ్లు. అంతటి డిమాండ్ ఉన్న దర్జీలు నేడు రెడీమేడ్ దుస్తుల కారణంగా ఉపాధి కోల్పోయేలా ఉన్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ దర్జీ వృత్తిలో కొనసాగుతున్న మేరు కులస్తులకు మెటీరియల్ ధరలు పెరగడం కూడా ఒక సవాల్‌గా మారింది.

ప్రభుత్వం డ్రెస్సులు కుట్టే అవకాశం ఇస్తేనే..

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే డ్రెస్సులను మేరు కులస్తులచే కుట్టించి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా పోలీస్ యూనిఫాం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులకు ఇచ్చే డ్రెస్సులు, మున్సిపల్ కార్మికులకు ఇచ్చే డ్రెస్సులు కుట్టే పని తమకు ఇస్తేనే రానున్న రోజుల్లో మనుగడ సాధ్యమని మేరు కులస్తులు అంటున్నారు. కొన్ని వందల సంవత్సరాల నుంచి దర్జీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న కఠిన పరిస్థితుల నుంచి బయటపడాలంటే ప్రభుత్వం ఇతర కులాలకు ఇస్తున్నట్లుగా తమకు కూడా సబ్సిడీపై రుణాలు, అధునాతనమైన కుట్టుమిషన్లు ఇవ్వాలని దర్జీలు కోరుతున్నారు. యాదవులకు గొర్రెలు, మత్స్యకారులకు చేప పిల్లలు ఇచ్చినట్లుగానే తమకు కూడా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఇచ్చే డ్రెస్సులు, యూనిఫాం కుట్టే పని ఇచ్చి ఆదుకోవాలని మేరు కులస్తులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెడీమేడ్ దుస్తుల కారణంగా దర్జీలకు గిరాకీ తగ్గిపోయింది. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే యూనిఫాం, మున్సిపల్ కార్మికులు, పోలీసులకు ఇచ్చే డ్రెస్సులను మేరు కులస్తులచే కుట్టించి ఉపాధి కల్పించాలి. అధునాతనమైన కుట్టు మిషన్లను ప్రభుత్వం సబ్సిడీతో అందించాలి. – నామ రాంప్రసాద్, మేరు సంఘం నల్లగొండ పట్టణ అధ్యక్షుడు

సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి



మేరు కులస్తులు ఉపాధి కోసం పోరాడాల్సి వస్తుంది. మేరు కులస్తులకు సబ్సిడీపై రుణాలు ఇవ్వడంతో పాటు కొత్త కుట్టు మిషన్లను ప్రభుత్వమే సమకూర్చాలి. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. ప్రభుత్వ డ్రెస్సులు కుట్టే పనిని మేరు కులస్తులకు ఇచ్చేలా చొరవ చూపాలి. – కొండ అంజిబాబు, టైలర్, పానగల్

గిట్టుబాటు కావడంలేదు



టైలరింగ్ రంగంలో ఉపాధి తగ్గిపోయినందున ప్రభుత్వమే దర్జీలను ఆదుకోవాలి. మిషన్ కుట్టి జీవిస్తున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలతో పాటు ప్రభుత్వం పని కల్పించే విధానం తీసుకురావాలి. ప్రస్తుతం మెటీరియల్ ధర కూడా పెరగడంతో పాటు గిట్టుబాటు కావడం లేదు. – కోడి అశోక్, టైలర్

నకిరేకల్ రూపురేఖలు మారుతాయి



నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులతో నకిరేకల్ టౌన్ రూపురేఖలే మారుతున్నాయని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో రూ.26 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పద్మనగర్ జంక్షన్ వద్ద సర్కిల్ చౌరస్తా ఏర్పాటు చేయాలని, పన్నాలగూడెం వద్ద ఎత్తుగా ఉన్న రోడ్డును తగ్గించి సర్కిల్ చౌరస్తా నిర్మించాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మెయిన్ సెంటర్‌లో సర్కిల్ చౌరస్తా ఏర్పాటు వల్ల వాహనదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున పడవ రూపంలో చౌరస్తా నిర్మించాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల మేర ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా మున్సిపాలిటీ ఈఈ గిలకత్తుల సత్యనారాయణగౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఏఈ గౌతంరాజు, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, పన్నాల పావనిశ్రీనివాస్‌రెడ్డి, చౌగోని రజితశ్రీనివాస్, యాసారపు లక్ష్మీవెంకన్న, గీత సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్, శివాలయ చైర్మన్ ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విద్యార్థులు ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని శ్రీసరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం, స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారుపాక నర్సయ్య, పాఠశాల చైర్మన్ పూజర్ల శంభయ్య, ఎంఈఓ ఎం. నాగయ్య, అడ్మినిస్ట్రేటర్ మారుపాక సురేష్ పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ జయంతి వేడుకలు

నల్లగొండటౌన్: జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో గురువారం నిర్వహించనున్న సంత్ సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలని ఆలిండియా బంజారా సంఘం జిల్లా గిరిజన అధ్యక్షుడు ఆంగోతు ప్రవీణ్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు కేశవత్ నగేష్‌నాయక్, లీగల్ అడ్వైజర్ రమావత్ నాగార్జుననాయక్, లకావత్ రవినాయక్, నరసింహనాయక్, ఆంగోతు విజయ్‌నాయక్, రమావత్ సక్రునాయక్, నరేందర్ నాయక్ పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి

నల్లగొండటూటౌన్: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 400 ఎంపీ సీట్ల సాధనే లక్ష్యంగా బీజేపీ విజయ సంకల్ప యాత్ర చేపట్టిందని తెలిపారు. ఈ నెల 28న డిండి మండలంలోకి ఈ యాత్ర ప్రవేశిస్తుందని, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ స్థానాలలో మూడు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రజలను చైతన్యం చేసి మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టడమే ఈ యాత్ర లక్ష్యమని తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యాత్ర ప్రముఖ్ పోతేపాక సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరాచారి, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు పోతేపాక లింగస్వామి, మండల వెంకన్న, నాయకులు కొండా భవానీప్రసాద్, పెరిక మునికుమార్, పిన్నింటి నరేందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పక్కీరు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులపై దాడులు చేయించడం సరికాదు



నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు

చిట్యాల: ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ అన్నారు. రైతులపై దాడులకు నిరసనగా చిట్యాలలో మంగళవారం సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు, నల్ల బ్యానర్‌లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల న్యాయమైన డిమాండ్‌లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు లడే రాములు, సీపీఎం నాయకులు శీలా రాజయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు నారబోయిన శ్రీనివాస్, మేడి పాపయ్య, అక్కెనపల్లి నాగయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

శాలిగౌరారం: బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర నాయకుడు, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన శివగంగ ఆలయ ఉత్సవాల ముగింపునకు నాయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలతో పాటు దేశ ప్రతిష్టను కాపాడేందుకు తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలే బీజేపీ గెలుపునకు కృషిచేస్తాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 400 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక అభాసుపాలవుతుందన్నారు. కేసీఆర్ బూచోడుగా మారాడు కాబట్టే రాష్ట్ర ప్రజలు ఆయనను, ఆయన పార్టీని ఇంటికి పంపారన్నారు. బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని, ప్రజలతో మాత్రమే తమకు పొత్తు ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్, నాయకులు గిరగాని యాదగిరి, బోడ రాజు, అల్లి రాములు, తుల వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, చాడ శ్యాం సుందర్‌రెడ్డి, తోట యాదగిరి, వినోద్, వెంకన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్ పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న ఎంపీ గోనారెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లైబ్రరీకి మంగళవారం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ ఎంపీ గోనారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యాం, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కళాశాల లైబ్రేరియన్ రాజారాం, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

యాగశాల నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఓరుగంటి నారాయణ దంపతులు

కనగల్: మండలంలోని చినమాదారం గ్రామ పంచాయతీ పరిధి కుమ్మరిగూడెంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ ఆలయంలో యాగశాల నిర్మాణానికి చెట్లచెన్నారం గ్రామానికి చెందిన ఓరుగంటి నారాయణ దంపతులు, వారి కుమారులు శ్రీనివాస్, రమేష్ కలిసి రూ.1,51,000 విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లికంటి రాజు, కోఆపరేటివ్ డైరెక్టర్ చిట్టిమల్ల కోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సిలివేరు విష్ణు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం దీవంత, అంగన్‌వాడీ టీచర్ సిలివేరు లక్ష్మి, మరియమ్మ, ఆయాలు సైదమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తిప్పర్తి మండలం మామిడాల జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



చిట్యాల: ఎలికట్టె జెడ్పీహెచ్‌ఎస్‌లో..



కట్టంగూర్: ముత్యాలమ్మగూడెం ప్రాథమిక పాఠశాలలో..

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మామిడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూనె విష్ణు, పెరిక కిరణ్, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పీఈటీ శైలజ పాల్గొన్నారు.

ఎలికట్టె జెడ్పీహెచ్‌ఎస్‌లో..

చిట్యాల: మండలంలోని ఎలికట్టె జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం ఆర్. వెంకట్‌రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ ఎం. శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మగూడెం ప్రాథమిక పాఠశాలలో..

కట్టంగూర్: మండలంలోని ముత్యాలమ్మగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం జె. మల్లికార్జున్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూడుదుడ్ల సత్యనారాయణ, కె. భవాని పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయపల్లి గ్రామ పరిధిలోని గుట్టపై కొలువైన వారిజాల వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గోపలాయపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరీదేవి దంపతులు, మాజీ సర్పంచ్ గోసుల భద్రాచలం, దార యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ యాట సైదులు, నర్రా నర్సిరెడ్డి, గుత్త కృష్ణారెడ్డి, గోవర్ధన్, మచ్చ రాజు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

కేతేపల్లి: మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో యాసంగిలో రైతులు సాగుచేసిన వరి పొలాలను మంగళవారం కేతేపల్లి ఏఓ బి. పురుషోత్తం పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు 2 గ్రాముల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ మందును లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే అగ్గి తెగులు నివారణకు తీవ్రతను బట్టి 0.6 గ్రాముల ట్రై సైక్లజోల్ లేదా 1.5 మి.లీ. ఐసోప్రొథిలిన్ మందును లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. ఏఓ వెంట రైతులు సతీష్, సైదులు ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వాలు అందజేత



ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని వనిపాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్- తెలంగాణ (పీఆర్‌టీయూ టీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి పాల్గొని పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొడిదల శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఇమామ్ కరీం, జిల్లా నాయకులు మణిరాజు, కలింగాచారి, చిట్యాల మండల అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎస్‌కే లతీఫ్ పాల్గొన్నారు.

అరగంట ముందే పరీక్షా కేంద్రానికి రావాలి



మర్రిగూడ: పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శివస్వరూపరాణి

మర్రిగూడ: నేటి నుంచి మార్చి 19 వరకు జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్. శివస్వరూపరాణి అన్నారు. మంగళవారం మర్రిగూడ ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల హాల్‌టికెట్ల నంబర్లను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

నాంపల్లిలో...

నాంపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రానికి బుధవారం ఉదయం 8.30గంటలకు ముందే విద్యార్థులు చేరుకోవాలని పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ రజనీకాంత్ సూచించారు. మంగళవారం కళాశాలలో పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

చండూరు: చండూరు వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సభ్యులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని.. సమయానికి సభ్యులు హాజరై తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కనగల్: మండల కేంద్రంలోని వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనగల్ గ్రామానికి చెందిన చిలువేరు నరసింహ, ఎరుకల నాగులు, బైరి నాగయ్య, బచ్చగొని నాగరాజు అనుమతులు లేకుండా నల్లగొండకు ఇసుక తరలిస్తుండడంతో పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

మర్రిగూడ: మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అందించిన క్రికెట్, వాలీబాల్ కిట్లను మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలో యువతకు బీఆర్‌ఎస్ మండల నాయకుడు చెరుకు శ్రీరాములుగౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల యువత పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం ఎన్నిక

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం(ఒకటవ) మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని మంగళవారం గ్రామంలో జిల్లా మత్స్యశాఖ ఎన్నికల అధికారి శరత్ సమక్షంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నూతి సైదులు ముదిరాజ్, ఉపాధ్యక్షుడుగా నూతి లింగస్వామి ముదిరాజ్, కార్యదర్శిగా నూతి పెదలింగస్వామి, డైరెక్టర్లుగా నూతి రామలింగం, నూతి చంద్రయ్య, నూతి మహాలింగం, నూతి శ్రీహరి, నూతి అశోక్, నూతి శ్రీను ఎన్నికయ్యారు.

మార్కెట్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

మర్రిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ తూర్పింటి రవికి చౌటుప్పల్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేష్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడపడంతో పాటు గత ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం రవి అహర్నిశలు కృషిచేశారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సిరిపంగి శ్రీనివాస్, నాంపల్లి, మునుగోడు, చండూరు ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

కేతేపల్లి: ఢిల్లీ శివారులో నిరసన తెలుపుతున్న రైతులకు మద్దతుగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పంటల మద్దతు ధరకు చట్టబద్ధత, రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు నిర్వహిస్తున్న ర్యాలీకి రైతుసంఘాల నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులు మనోధైర్యం కల్గిఉండాలి

నాంపల్లి: ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులు మనోధైర్యం కల్గి ఉండాలని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి పి. సరిత అన్నారు. మంగళవారం నాంపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి విజయశిర, అధ్యాపకులు మమత, జ్యోతి, శ్రీలత, లలిత, వాణి, మంజుల పాల్గొన్నారు.